సాక్షి తిరుపతి

మంగళవారం, 2, మే, 2023



నమో..నారసింహా!

పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. -8లో



అర్జీలకు పరిష్కారం చూపండి

స్పందనకు వచ్చే అర్జీలను అధికారులు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. -8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	24
తిరుపతి	32	25
తిరుమల	27	21
గూడూరు	32	26
నగరి	31	25

న్యూస్‌రీల్

తిరుపతి-కడప మధ్య 12 విద్యుత్ బస్సులు



తిరుపతి నుంచి కడపకు నడపడానికి సిద్ధం చేసిన విద్యుత్ సర్వీసులు

తిరుపతి అర్బన్: తిరుపతి నుంచి కడపకు సోమవారం నుంచి 12 విద్యుత్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. అలిపిరి కేంద్రంగా వంద విద్యుత్ బస్సులను కేటాయించగా.. ఇప్పటికే 95 విద్యుత్ బస్సులు చేరాయి. మరో ఐదు బస్సులు త్వరలో రానున్నాయి. ఇందులో 50 సర్వీసులు తిరుపతి నుంచి తిరుమలకు నడుపుతుండగా.. మరో 14 విద్యుత్ బస్సులను తిరుపతి నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తిప్పుతున్నారు. తాజాగా కడపకు 12 విద్యుత్ సర్వీసులు ఏర్పాటు చేశారు. మొత్తంగా 76 విద్యుత్ సర్వీసులు వాడుకలోకి తీసుకొచ్చారు. మరో 19 విద్యుత్ సర్వీసులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్నాయి. అన్నీ వచ్చిన తర్వాత 12 విద్యుత్ సర్వీసులు నెల్లూరుకు, మరో 12 మదనపల్లికి ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా తిరుపతి జిల్లాకు మరో 224 విద్యుత్ బస్సులు మంజూరు చేశారు. అవి వచ్చిన తర్వాత మంగళం డిపోతోపాటు తిరుపతి డిపోను కేంద్రంగా చేసుకుని అవసరమైన అన్ని ప్రాంతాలకు సర్వీసులు ఏర్పాటు చేయనున్నారు.

స్పందనకు 60 వినతులు



ఫిర్యాదును స్వీకరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 60 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందినట్టు పేర్కొన్నారు. వీటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత పోలీసులను ఆదేశించారు

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 82,582 మంది స్వామివారిని దర్శించుకోగా.. అందులో 43,526 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.19 కోట్లు లభించాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జనసంద్రం.. ముక్కంటి ఆలయం



క్యూలను క్రమబద్ధీకరిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తజనసంద్రంగా మారింది. వారాంతపు సెలవులు, మేడే, విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో పలు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలోని క్యూలు కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు చంటిబిడ్డల తల్లులు, వృద్ధులకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేసి త్వరగా దర్శనం చేయించారు.

స్వామి సేవకులం.. స్వచ్ఛ సైనికులం!

పారిశుద్ధ్య కార్మికుల ఆకస్మిక సమ్మె కారణంగా శ్రీవారి భక్తులకు ఇబ్బందులు కలగకుండా స్వచ్ఛందంగా సేవ చేయడానికి టీటీడీ, జిల్లా ఉన్నతాధికారులు ముందుకొచ్చారు. తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న సులభ్ కార్మికుల్లో స్ఫూర్తిని నింపేలా హోదాలు పక్కనబెట్టి చీపుర్లు పట్టారు. తమ విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండానే తిరుమలలో ఉదయం నుంచి పారిశుద్ధ్యపనుల్లో తలమునకలయ్యారు. బాత్‌రూములు శుభ్రం చేయడం నుంచి కంపార్ట్‌మెంట్ల క్లీనింగ్ వరకు అన్నిపనులు చేస్తూ భక్తులచేత ప్రశంసలందుకుంటున్నారు.

- సులభ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో స్వచ్ఛంద సేవ
- స్వచ్ఛ తిరుమలే లక్ష్యంగా పారిశుద్ధ్య పనులు
- హోదాలు పక్కనబెట్టి చీపుర్లు పట్టిన ఉన్నతాధికారులు
- భక్తులకు ఏలోటూ రాకుండా పకడ్బందీ చర్యలు
- మేమున్నామంటూ ముందుకొచ్చిన మీడియా ప్రతినిధులు
- దిగ్విజయంగా పూర్తిచేస్తున్న టీటీడీ అధికారులు

తిరుమల: కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవారి దర్శనార్థం నిత్యం 60 వేల నుంచి లక్ష మంది భక్తులు తిరుమలకు వస్తుంటారు. ఇందులో ఏ ఒక్కరికీ చిన్నలోటు రానీయకుండా టీటీడీ అధికారులు పకడ్బందీగా చర్యలు చేపడుతుంటారు. నిత్యం పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం మూడు వేల మంది వరకు సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. వీరిని టీటీడీ టెండర్ విధానంలో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా తీసుకుని పనులు అప్పగిస్తుంటారు. స్వచ్ఛంద సంస్థయైన సులభ్‌కి మాత్రం నామినేషన్ విధానంలో పనులు అప్పగిస్తారు.

దుష్ప్రచారాన్ని నమ్మి.. విధులకు దూరమై

ఇటీవల సులభ్ సంస్థ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని టీటీడీ భావించింది. నామినేషన్ విధానంలో

ప్రత్యామ్నాయం వైపు వేగంగా అడుగులు

సులభ్ కార్మికులు సమ్మెకు దిగడంతో టీటీడీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా యంత్రాంగం సహకారంతో తాత్కాలిక ప్రాతిపదికన తిరుపతి కార్పొరేషన్‌తో పాటు సమీప ప్రాంత పంచాయతీల నుంచి కార్మికులను తిరుమలకు తరలించి పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.

పనులు అప్పగించకుండా టెండర్లు పిలవాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ప్రకియ ప్రారంభించింది. ఈ సమయంలో సులభ్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు తగ్గిపోతాయని భావించి కొందరు దుష్ప్రచారం చేశారు. దీంతో కార్మికులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏప్రిల్ 22 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. దాదాపుగా 1,600 మంది పారిశుద్ధ్య సిబ్బంది విధులకు దూరమయ్యారు.

మూడంచెల విధానంలో..



పారిశుద్ధ్య పనుల్లో సీవీఎస్వో నరసింహకిషోర్





తిరుమలలో చీపుర్లు పట్టి రోడ్లు ఊడ్చుతున్న టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

మరో వైపు టీటీడీతో సంబంధం లేని కార్మికుల బెదిరింపుల నేపథ్యంలో ఈవో ధర్మారెడ్డి మూడంచెల విధానానికి దిగారు. అందులో భాగంగా తాత్కాలికంగా ప్రభుత్వ సహకారంతో కార్మికులను తిరుమలకు తరలించి వారికి సహకారంగా టీటీడీ ఉద్యోగులతో పాటు ఉన్నతాధికారులను పారిశుద్ధ్య పనులకు దించడం.. పది రోజుల వ్యవధిలో పారిశుద్ధ్య పనులను ఇతర ప్రైవేట్ ఏజెన్సీలకు తాత్కాలికంగా అప్పగించడం, మూడు నెలల కాలంలో టెండర్ ప్రకియను పూర్తిచేసి పనులు పూర్తి స్థాయిలో అప్పగించడం.. ఇలా టీటీడీ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

భక్తుల సేవ..భగవంతుని సేవే

ఏదో ఫొటోలకు ఫోజులిచ్చేలా కాకుండా అధికారులు పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పారిశుద్ధ్య పనుల్లో పాల్గొంటున్నారు. కార్మికులు సమ్మెకు దిగిన రెండో రోజు నుంచి మీడియా ప్రతినిధులను ఇందులో భాగస్వామ్యం చేశారు. నెలరోజుల పాటు ఈ విధానం కొనసాగిస్తామని, భవిష్యత్‌లో ఘాట్ రోడ్డులో శుభ్రత కార్యక్రమాన్ని స్వయంగా నిర్వహిస్తామని టీటీడీ ఈఓ స్పష్టం చేశారు. ఇందులో పాల్గొనడానికి ప్రముఖులను కూడా ఆహ్వానిస్తామని తెలిపారు. కార్మికుల సమ్మెతో భక్తులకు చిన్నపాటి అసౌకర్యం కూడా కలగకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రశంసలందుకుంటున్నారు.



జేఈఓ సదాభార్గవి బృందం

13న సామూహిక శ్రమదానం

తిరుమలలో టీటీడీ ఉద్యోగులు చేపట్టిన సుందర తిరుమల-శుద్ధ తిరుమల సామూహిక పరిశుభ్రత కార్యక్రమం విజయవంతం కావడంతో ఇదే స్ఫూర్తితో ప్లాస్టిక్ రహిత తిరుమలగా మార్చేందుకు ఈనెల 13న సామూహిక శ్రమదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. సోమవారం తిరుమలలోని సేవాసదన్ 2లో కలెక్టర్, ఎస్పీతో పాటు టీటీడీలోని అన్ని విభాగాధిపతులతో ఈవో సమావేశం నిర్వహించారు.

మేము సైతం

కార్మికుల్లో స్ఫూర్తిని నింపేలా టీటీడీ, జిల్లా ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఒక్కో విభాగాన్ని ఎంచుకుని పారిశుద్ధ్య పనుల్లో తలమునకలవుతున్నారు. ఇందులో టీటీడీ ఈవో ధర్మారెడ్డి - సీఆర్ఓ కాంప్లెక్స్ విభాగంలో విధులు నిర్వహించగా.. జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి - లేపాక్షి సర్కిల్, జేఈవోలు సదాభార్గవి - పాత అన్నదానం కాంప్లెక్స్, వీరబ్రహ్మం - వైకుంఠం క్యూ కాంప్లెక్స్, సీవీఎస్వో నరసింహ కిషోర్ జీఎన్సీ, సీఈ నాగేశ్వరరావు - శిలాతోరణం, ఎఫ్ఏసీఏవో బాలాజీ - నారాయణగిరి ఉద్యానవనాలు తదితర ప్రాంతాల్లో ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖకుమార్, ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, డీఈవో భాస్కర్‌రెడ్డి తదితరులు వారికి కేటాయించిన విభాగాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు.



రోడ్లు ఊడ్చుతున్న టీటీడీ అధికారులు, మీడియా ప్రతినిధులు

గంగమ్మా..చల్లంగా చూడమ్మా!

- తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకానికి శ్రీకారం

తిరుపతి కల్చరల్: సాక్షాత్తు తిరుమల శ్రీవారి చెల్లెలుగా, భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి ఆలయ పునఃప్రారంభం సందర్భంగా అమ్మవారి ఆలయంలో తలపెట్టిన మహా కుంభాభిషేక మహోత్సవానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో అమ్మవారి మహా కుంభాభిషేక మహోత్సవం పూజలను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. తొలిరోజు ఎమ్మెల్యే దంపతులు, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి దంపతులు మహా కుంభాభిషేకానికి సంబంధించిన ప్రధాన కలశం, అమ్మవారి ప్రతిష్ట పీఠంలో స్థాపన చేసే బంగారు యంత్రం, పూజాఫలాలను ఆలయ ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం మహా కుంభాభిషేక మహోత్సవాన్ని ప్రారంభించారు. వెయ్యేళ్ల క్రితం తిరుపతి గంగమ్మను ప్రతిష్ఠించిన తిరుమల శ్రీవారి పరమభక్తుడైన అనంతాళ్వార్ వంశస్థులైన 22వ తరానికి చెందిన కస్తూరంగన్ సారథ్యంలో ఈ మహాకుంభాభిషేక మహోత్సవం చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది వేద పారాయణ ఘనాపాటీలైన వేద పండితులు హాజరయ్యారు. ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు వేద పారాయణ ఘోష్టి చేపట్టారు.

10 నుంచి గంగమ్మతల్లి జాతర

తిరుమల శ్రీవారి ఆశీస్సులతో అంగరంగ వైభవంగా గంగమ్మతల్లి జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. సోమవారం గంగమ్మ ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.



మహాకుంభాభిషేక పూజల్లో ఎమ్మెల్యే బూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు జరిగే గంగమ్మ తల్లి జాతర బ్రహ్మోత్సవాలు శ్రీవారి ఆశీస్సులతో వైభవోపేతంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

డీజే వాహనాలు ప్రారంభం

గంగమ్మతల్లి జాతర బ్రహ్మోత్సవాల ప్రాముఖ్యత తెలిపే పది ప్రచార డీజే వాహనాలను ఎమ్మెల్యే భూమన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం,మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

గంగజాతరకు రూ.10లక్షల వితరణ

తిరుపతి గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో గంగమ్మ జాతర నిర్వహణకు తమ వంతు సహకారంగా క్రెడాయ్ చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ అధ్యక్షుడు రామ్‌ప్రసాద్, కోశాధికారి, సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ దర్శనం తర్వాతే శ్రీవారి దర్శనం

శ్రీతాతయ్య గుంట గంగమ్మను దర్శించి తర్వాత తిరుమల శ్రీవారిని దర్శించే సంప్రదాయాన్ని భక్తులు పునఃప్రారంభించాలని రాష్ట్ర మంత్రి ఆర్కే.రోజా పిలుపు నిచ్చారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ ప్రతిష్ట, ఆలయ పునఃప్రారంభం నేపథ్యంలో అమ్మవారి మహాకుంభాభిషేక మహోత్సంలో ఆమె పాల్గొన్నారు. అంతకుముందు మంత్రికి ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన చొరవతో ముఖ్యమంత్రి జగనన్న తిరుపతి గంగ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించారన్నారు.



మహా కుంభాభిషేకం పూజల్లో మంత్రి రోజా

పరిపూర్ణం..పరిణయోత్సవం





పరిణయోత్సవంలో స్వామి, అమ్మవార్లు (ఇన్‌సెట్) పరిణయ వేదికకు గరుడవాహనంపై ఊరేగింపుగా వెళుతున్న స్వామివారు

తిరుమలలో శ్రీపద్మావతీ, శ్రీనివాసుల కల్యాణం కమనీయంగా సాగింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలకు నారాయణగిరి ఉద్యానవనం భక్తులతో కిక్కిరిసింది. చివరి రోజైన సోమవారం సాయంత్రం శ్రీవారి ఆలయం నుంచి స్వామివారు గరుడ వాహనంపై, దేవేరులు పల్లకీపై ఊరేగింపుగా బయల్దేరి నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతీ పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేశారు. కళాకారులు మంగళకరంగా సంగీత, మేళ, తాళ వాయిద్యాలను ప్రదర్శించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రసరమ్యంగా అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. హారతి అనంతరం స్వామి దేవేరులతో కలిసి ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. భక్తులు కర్పూర నీరాజనాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో మూడురోజుల పద్మావతీ పరిణయోత్సవాలు ఘనంగా ముగిశాయి.

– తిరుమల

పిడుగుల వాన

నారాయణవనం: జిల్లా వ్యాప్తంగా సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గాలీ వానతోపాటు పిడుగులు పడడంతో జనం బెంబేలెత్తిపోయారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. నారాయణవనం మండలంలోని కీళగరం దళితవాడ, సముదాయం గ్రామాల్లో కొబ్బరి చెట్లపై పిడుగులు పడడంతో మంటలు అంటుకున్నాయి. రెడ్డిమడుగు కాలువ పూర్తి స్థాయిలో ప్రవహించింది. వర్షానికి తహసీల్దార్ కార్యాలయంలోని ఫైళ్లు, కంప్యూటర్లు తడిచిముద్దయ్యాయి.కార్యాలయంలో అడుగు లోతు వరకు వర్షపునీరు చేరింది. ఒబ్బిడికి సిద్ధంగా ఉన్న సన్‌ఫ్లవర్ పంట పూర్తిగా తడిచిపోయింది. గింజలు మగ్గితే నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న మడుగు కల్వర్ట్



సముదాయం గ్రామంలో పిడుగు పడి కాలిపోతున్న కొబ్బరి చెట్టు

పన్ను వసూళ్లలో తిరుపతి అగ్రస్థానం


మీడియాతో మాట్లాడుతున్న హరిత

తిరుపతి తుడా: పన్ను వసూళ్లలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని కమిషనర్ హరిత తెలిపారు. కమిషనర్ సోమవారం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.62 కోట్ల డిమాండ్ ఉండగా ముందస్తు పన్ను వసూళ్లలో మొత్తం రూ.28.59 కోట్లు వచ్చినట్లు చెప్పారు. ఇంటి పన్ను రూ.25.62 కోట్లు, నీటి చార్జీలు రూ.1.91 కోట్లు, భూగర్భ నీటి చార్జీలు రూ.51.56 లక్షలు, ఖాళీ జాగా పన్నులు రూ.55 లక్షలు వసూలైనట్లు తెలిపారు. కార్పొరేషన్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు అవగాహనతో ముందస్తుగా పన్నులు చెల్లించి, ఐదు శాతం రాయితీని పొందారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 6వ తేదీ నుంచి ప్రకటించిన పన్ను రాయితీ ద్వారా నగర ప్రజలకు రూ.1.28 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు.

నమో..నారసింహా!

- అంగరంగ వైభవంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు
- ఆగమోక్తంగా అంకురార్పణ
- ఉభయ దేవేరులతో కలిసి కోనకు చేరిన స్వామివారు
- గోనుపల్లిలో పండుగ వాతావరణం

రాపూరు: పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అత్తారిల్లు గోనుపల్లి నుంచి స్వామివారు ఉభయదేవేరులు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మితో కలిసి పెంచలకోనకు చేరుకున్నారు. కొత్త అల్లుడు పెంచలకోనకు చేరుకోవడంతో బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి.

నృశింహుడు పెళ్లికొడుకాయనే!

హిరణ్యకసిపుని వధించిన ఉగ్రరూపుడైన స్వామివారు నరసింహ అవతారంలో వెలుగొండలలో సంచరిస్తుండగా చెంచురాజు(గిరిజనరాజు) కుమార్తె చెంచులక్ష్మి చెలిమితో శాంతించి ఆమెను వివాహమాడినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ మేరకు గోనుపల్లి గ్రామంలోని స్వామివారు పెళ్లికొడుకై ఉదయం గోనుపల్లి గిరిజన కాలనీకి రావడంతో ఆ కాలనీలో పెళ్లి సందడి నెలకొంది. ఉత్సవమూర్తులను దేవదాయ సిబ్బంది గిరిజన కాలనీకి తీసుకొచ్చారు. గిరిజనులు సంప్రదాయ బద్ధంగా ఇంటి అల్లుడికి, కుమార్తెకి ఆతిథ్యం ఇచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఆహారం, ఇతర లాంఛనాలు అందించేందుకు తెల్లవారుజామునే అడవికి వెళ్లి పుట్టతేనె, ఇంజేటిగడ్డలు, సారపప్పు, పెద మల్లెపూలు, బందారు ఆకులతో భాషికం, ఎల్లగడ్డలు, తంగేడుతో తాళిబొట్టు, స్వామి వారికి కట్నంగా ఇచ్చే ఆరినార మొలతాడును అందజేసి సాంగ్యం చెల్లించారు. స్వామివారికి టెంకాయ, కర్పూరం, వడపప్పు, చీర, రవికలు సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి గుమ్మం వద్ద తోరణాలతో ప్రత్యేక చలువ పందిళ్లు ఏర్పాటు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లు పెంచలకోనకు గోనుపల్లి నుంచి బయలుదేరగానే వర్షం ప్రారంభమైంది. ఉత్సవర్లు వర్షానికి తడవకుండా ఆఛదన (గొడుగులాంటిది) ఏర్పాటు చేశారు.

గొల్లబోయికి తొలిదర్శనం

శ్రీవారు అప్పట్లో తమ మహిమలను గురించి గ్రామస్తులకు వివరించి ఆలయం నిర్మించమని చెప్పినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. అలాగే గొల్లబోయిని వెనుతిరిగి చూడకుండా వెళ్లమని ఆదేశించాచగా.. గొల్లబోయిన వెనుతిరిగి చూడడంతో శ్రీవారే గొల్లబోయి శిలారూపం దాల్చారని ప్రతీతి. దీంతో ఏటా శ్రీవారు సతీసమేతంగా గొల్లబోయికి తొలి దర్శనమివ్వడం ఆనవాయితీగా వస్తోంది.


భక్తజనసందోహం నడుమ ఊరేగుతున్న ఉత్సవర్లు

మార్మోగిన గోవింద నామస్మరణ

గోనుపల్లి నుంచి ఉభయనాంచారులతో బయలుదేరిన శ్రీవారి పల్లకీని బోయలు కాళ్లకు పాదరక్షలులేకుండా మోసుకుంటూ కోనకు తీసుకొచ్చారు. పెంచలకోనలోని క్రేన్ మండలపంలో మధ్యాహ్నం 12 గంటలకు స్నపన తిరుమంజనాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. రాత్రి 7 గంటలకు అనుజ్ఞ, వేదస్వస్తి, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం తదితరాలను నిర్వహించారు. 9 గంటలకు స్వామివారి అలంకార మండపంలో వేదమంత్రోచ్ఛారణలతో అంకురార్పణ గావించారు. స్వామివారి నందనవనంలోని పుట్టమట్టిని తీసుకొచ్చి అందులో నవధాన్యాలు కలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


స్వామివారికి కట్నంగా సమర్పిస్తున్న గడ్డలు, ఆరినార మొలతాడు


పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి వేంచేస్తున్న స్వామి, అమ్మవార్లు



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.62,150
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,551
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.76,900
రిటైల్ వెండి గ్రాము రూ.78.90

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి


శ్రీనివాసులు(ఫైల్)

శ్రీకాళహస్తి రూరల్: పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన సోమవారం శ్రీకాళహస్తి మండలంలో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మంగళపురి గ్రామానికి చెందిన ముచ్చువోలు శ్రీనివాసులు(57) సోమవారం యథావిధిగా తమకున్న గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఆ సమయంలో పొలాల్లోనే గొర్రెలు మేపుకుంటూ ఉండడంతో పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన రాజయ్య అనే రైతు కూడా పిడుగుపాటుకు స్పృహతప్పి పడిపోయాడు. 20 నిమిషాల తర్వాత రాజు తేరుకుని లేచి చూడగా శ్రీనివాసులు మృతి చెంది ఉన్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పిడుగు పడి ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని రాంబట్లపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ గురునాథ రెడ్డి ఎద్దుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని రైతు ఆవేదన చెందారు.

బత్తెనయ్య కొండపై మెరుపులు

ఏర్పేడు: మునలిపేడు సమీపంలోని బత్తెనయ్య కొండపై విద్యుత్ కాంతులను వెదజల్లేలా మెరుపులు రావడంతో సోమవారం రాత్రి భక్తులు పరుగులు తీశారు. ప్రతి సోమవారం బత్తెనయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా రాత్రి ఆలయ ఆవరణలోనే నిద్రిస్తుంటారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి కొద్దిపాటి వర్షం కురవడం.. ఆపై భయంకరమైన శబ్దాలతో కొండపై విద్యుత్ కాంతులు వెదజల్లడంతో భక్తులు భయకంపితులయ్యారు. రాత్రికి రాత్రే కొండపై నుంచి కిందకు దిగారు. వర్షం వస్తే బత్తెనయ్య కొండపై అమర్చిన తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి దిశను చూపే సోలార్ లైట్ నుంచి ఇలాంటి కాంతి వస్తుందని గ్రామస్తులు, ఆలయ పూజారి తెలిపారు.

అర్జీలకు పరిష్కారం చూపండి

తిరుపతి అర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు 82 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్‌తోపాటు డీఆర్వో శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండ రామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ వినతులను స్వీకరించారు. ఆ మేరకు వాటికి పరిష్కారమార్గం చూపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పందనకు ప్రతివిభాగానికి చెందిన అధికారులు హాజరుకావాలన్నారు. స్పందనలో రెవెన్యూ సమస్యలే అధికంగా ఉన్నాయని చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

నాయుడుపేట: పట్టణంలోని ఆకుతోట వీధి కాలవగట్టుపై సోమవారం విజిలెన్స్, సివిల్‌సప్లయ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిల్వ ఉంచిన 42 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 1,890 కిలోల బియ్యం నిల్వ ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. వీటి విలువ రూ.68,040 విలువ చేస్తాయని చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఏఆర్ విజయకుమార్, ఎస్ఐ నాయక్, సీఎస్ డీటీ ఓబయ్య పాల్గొన్నారు.

పీఎంశ్రీకి 23 పాఠశాలలు ఎంపిక


మాట్లాడుతున్న డీఈఓ డాక్టర్ శేఖర్

తిరుచానూరు(చంద్రగిరి): ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీ) పథకం కింద 23 ప్రభుత్వ పాఠశాలలు ఎంపికైనట్లు డీఈవో డాక్టర్ శేఖర్ అన్నారు. ఆయన సోమవారం తిరుచానూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన (ఆ 23 పాఠశాలల) హెచ్‌ఎంల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ హెచ్‌ఎంలు మరింత శ్రద్ధ తీసుకొని పాఠశాలల అభివృద్ధికి కావలసిన బడ్జెట్‌ను తయారుచేసి మంగళవారంలోపు పంపించాలని ఆదేశించారు. నూతన విద్యావిధానంలో భాగంగా ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. దీనికి ఎంపికైన పాఠశాలల అభివృద్ధి కోసం కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను సమకూర్చనున్నట్లు వివరించారు. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో మంజూరు చేస్తుందని వెల్లడించారు. ఈ నిధులతో ఎంపికైన బడుల్లో సొంత భవనాలు, మరుగుదొడ్లు, స్మార్ట్ క్లాస్ రూంలు, ఆర్ట్‌రూం, సోలార్ ప్యానెళ్లు, ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంబీ శివ శంకరయ్య, సీఎంఓ సురేష్, ఏఎస్‌ఎస్‌సీఓ శ్రీధర్, ఇతర సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

మోదీ విద్యావిధానంపై విద్యార్థులు అప్రమత్తం


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్: ప్రధాని నరేంద్రమోదీ విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని విద్యార్థి లోకం తిప్పి కొట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపు నిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య పార్టీ విభాగం జాతీయ స్థాయి 10 రోజుల రాజకీయ శిక్షణా తరగతులు సీపీఐ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. శాస్త్రీయ విద్యా విధానాన్ని దూరం చేస్తూ మతోన్మాద హిందుత్వ పోకలడలను విద్యా విధానంలో చొప్పించేందుకు ప్రధాని ప్రయత్నిస్తున్నారన్నారు. డార్విన్ సిద్ధాంతం పాఠ్యాంశాల నుంచి తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు చెందిన 13 లక్షల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత మోదీదేనన్నారు. ఏఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి విక్కీ మహేశ్వర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఆ పార్టీ జాతీయ విద్యావిభాగం కన్వీనర్ అనిరాజీంవాలేయుగల్‌రాయల్, కృష్ణజా, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి పాల్గొన్నారు.


చదువుకుంటూనే ఉద్యోగం


ప్లేస్ మెంట్‌లో ఉద్యోగం పొందిన విద్యార్థులతో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు

- చంద్రగిరి పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ
- క్యాంపస్ సెలెక్షన్స్‌లో 58 మందికి ఉద్యోగాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ప్రతిభ ఉన్నచోట ఉద్యోగాలకు కొదవలేదనే మాటను చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు నిరూపించారు. ఈ ఏడాది ఫైనల్ ఇయర్ చదువుతున్న 58 మంది విద్యార్థులు పలు కంపెనీలలో ఉద్యోగాలు సంపాదించారు. చంద్రగిరి సమీపంలోని అగరాల వద్ద ఉన్న పాలిటెక్నిక్ విద్యార్థులు టీసీఎల్, యఫ్‌ట్రానిక్స్, ఏఎంఎన్‌ఎస్, శ్రీ బాలాజీ ఎలక్ట్రికల్ వర్క్స్ కంపెనీలలో అధిక జీతంతో ఉద్యోగాలు సంపాదించారు. ఈ సందర్భంగా సోమవారం అగరాల సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సుకుమార్ అధ్యాపక బృందం ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం డాక్టర్ భక్తవత్సలం, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ నరసింహారెడ్డి, రవికుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



మా నాన్న జ్యోతిరాజ్ ఎలక్ట్రికల్ పనులు చేస్తూ చదివించాడు. ఎంతో కష్టపడి చదివాను. పదో క్లాసు డిప్లమా పూర్తి చేశాను. సంవత్సరానికి 2 లక్షల రూపాయల జీతంతో టీసీఎల్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాను. ఉన్నత చదువు అభ్యసిస్తూనే ఉద్యోగం చేసి తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటా.

\- పి.జె.లిఖితశ్రీ, విద్యార్థిని

కల నెరవేరింది



మా నాన్న వాసుదేవరెడ్డి కూలి పనులు చేసుకుని చదివించారు. జగనన్న అందించిన స్కాలర్‌షిప్‌తో నేను బాగా చదువుకున్నాను. ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించాలనేది నా కల. ఈరోజు నా కల నెరవేరింది. టీసీఎల్ కంపెనీలో రెండున్నర లక్ష రూపాయల జీతంతో ఉద్యోగం సంపాదించాను. నా తల్లిదండ్రులకు ఆధారంగా నిలబడతా.

\- సాయికిరణ్, వెంకటాపురం

ఇంకా చదవాలని ఉంది



మా నాన్న మునిరెడ్డి ఆటో డ్రైవర్. మా అమ్మ కుమారి హౌస్ వైఫ్. మా నాన్న ఎన్నో కష్టాలు పడి నన్ను చదివించాడు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి పాలిటెక్నిక్‌లో సీటు సాధించి చంద్రగిరిలో పూర్తి చేశా. మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తానే ఇంకా ఉన్నత చదువులు చదువుతా.

\- ఎస్ స్రవంతి, విద్యార్థి, చంద్రగిరి